ప్రజాశక్తి

శుక్రవారం 25 ఏప్రిల్ 2025

5

శ్రీ సత్యసాయి



సాగుభూమికి సోలార్ ఎసరు..!

◆ మడకశిర ప్రాంతంలో మరో ప్రాజెక్టు

◆ చింతాగ్రీన్ఎనర్జీకు భూమి

◆ లీజు పద్ధతిలో తీసుకునేలా ప్రభుత్వం అనుమతి

ఉమ్మడి జిల్లాలో సోలార్ కంపెనీలకు సాగుభూములు కట్టబెట్టే కార్యక్రమం శరవేగంగా సాగుతోంది. రోజుకో మండలంలో కార్పొరేట్ కంపెనీలకు భూములను లీజు పద్ధతిలో ధారాదత్తం చేస్తున్నారు. తాజాగా శ్రీసత్యసాయి జిల్లాలో మరో కంపెనీకి భూముని అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. వేలాది ఎకరాలను కార్పొరేట్ కంపెనీలకు కేటాయిస్తూనే పోతున్నారు ఇప్పటికే వేల ఎకరాలు భూకేటాయింపులు సోలార్ కోసమని ఇచ్చారు. తాజాగా మరో కంపెనీకి వేలాది ఎకరాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చింతా గ్రీన్ ఎనర్జీ అనే సంస్థకు పెద్ద ఎత్తున అనుమతులను ఇచ్చారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మడకశిర భారీ ప్రాజెక్టుకు అనుమతులు

శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ప్రాంతంలో భారీ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు ఇస్తూ గురువారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. మడకశిర ప్రాంతంలోని హరేసముద్రం, బుల్ల సముద్రం, ఉప్పర్లపల్లి, కళ్ళుమర్రి, ఎర్రబొమ్మనహళ్లి తదితర గ్రామాల్లో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. 2500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీని మూలంగా ఈ ప్రాంతంలో దాదాపు పదివేల ఎకరాల భూమి అవసరం. అవుతుంది. దీనికి నిర్దిష్టంగా కేటాయింపులు ఎంత అన్నది నిర్ణయించలేదు. లీజు పద్ధతిలో భూములను కంపెనీ సేకరించినందుకు అనుమతులను ప్రభుత్వం ఇచ్చింది. ఏడాదికి 31 వేల చొప్పున లీజు ఉండే విధంగా నిర్ణయించారు. రెండు సంవత్సరాలకు ఒకసారి ఐదు శాతం లీజు పెంచాలని పెంచాలని ఉత్తర్వులు పేర్కొనడం జరిగింది.

ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు

సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున అనుమతులు ఇచ్చింది. వేలాది ఎకరాలు ఇందుకోసం కేటాయించారు. ఇంత పెద్ద ఎత్తున భూమిని ఒకే జిల్లాలో కేటాయిస్తుండడం పట్ల విపక్షాల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాబోయే రోజుల్లో జిల్లాలో వ్యవసాయానికి సాగుభూమి కూడా కరువయ్యే పరిస్థితులు నెలకునే అవకాశం ఉందని ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు.

ఆరిన ఇంటిదీపాలు

◆ నీటిమడుగులో పడి ఇద్దరు యువకులు మృతి

◆ చంద్రగిరి గ్రామంలో విషాదం



గోవింద రాజులు



వంశీ

వాళ్లిద్దరూ అన్నదమ్ముల పిల్లలు. ఒకే వయసు వారు కావడంతో ఇద్దరూ కలిసిమెలిసి తిరిగే వారు. వ్యవసాయ కుటుంబాల నేపథ్యంలో ఒకరి పనుల్లో ఒకరు చేదోడువాదోడుగా ఉండేవారు. అన్నదమ్ముల అనుబంధం, స్నేహబంధం కలగలిపి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. ఇలాంటి వారిని అనుకోని ప్రమాదం వెంటాడింది. ఎద్దులను శుభ్రం చేసేందుకు నీటి ముడుగులోకి వెళ్లిన ఇద్దరు యువకులు ప్రమాదవశాత్తు అందులో మునిగి మృత్యువాత పడ్డారు. ఈ ఘటన రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. చేతికందిన ఇంటిదీపాలు ఆరిపోవడంతో తల్లిదండ్రులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. బొమ్మనహాల్ మండలం చంద్రగిరి గ్రామంలో గురువారం ఉదయం చోటు చేసుకున్న ఈ విషాద ఘటన గ్రామస్తులను కలచివేసింది.

ప్రజాశక్తి-బొమ్మనహాల్

చంద్రగిరి గ్రామానికి చెందిన చిన్న కుళ్లాయప్ప, పోతప్పలు దాయాది వరుస అన్నదమ్ములు అవుతారు. చిన్న కుళ్లాయప్పకు కుమారుడు గోవింద రాజులు(17), పోతప్పకు కుమారుడు వంశీ(16) ఉన్నారు. గోవిందరాజులు, వంశీ ఇద్దరూ ఎద్దులను శుభ్రం చేసేందుకు గురువారం ఉదయం ఎద్దుల బండితో సహా గ్రామ సమీపంలోని కర్నాటక సరిహద్దు ఎత్తిన భూదేహాల్, చంద్రగిరి గ్రామాల మధ్యన ఉన్న కుంట వద్దకు వెళ్లారు. హెచ్ఎల్సీ ఆధునీకరణ నిమిత్తం మట్టి కోసం దాదాపు 3 ఎకరాల్లో 20 అడుగుల లోతు వరకు ఈ కుంటను తవ్వారు. ఈ కుంటలో ఎప్పుడూ నీరు ఉంటాయి. ఇందులో గోవింద రాజులుకు సంబంధించిన ఎద్దులను శుభ్రం చేసేందుకు ఇద్దరు యువకులు వెళ్లారు. కుంట చివర ఎద్దుల బండిని ఉంచి ఎద్దులకు నీరు తాపడం మొదలు పెట్టారు. ఈ సమయంలో ఇద్దరు యువకులు ఎద్దుల బండిపై ఉన్నారు. నీళ్లు తాగుతున్న ఎద్దులు ఒక్కసారిగా నీటిలోకి ముందుకు పరుగుతీశారు. అక్కడ లోతు అధికంగా ఉండడంతో ఎద్దులతో సహా బండి మునిగిపోయింది. బండిపై ఉన్న ఇద్దరు యువకులు కూడా నీటిలో మునిగిపోయారు. లోతు ఎక్కువగా ఉండడం, బయటకు వచ్చేందుకు ఎద్దుల బండి అడ్డుగా ఉండడంతో నీటిలో ఊపిరాడక విద్యార్థులు గోవిందరాజులు, వంశీలు మరణించారు. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడికి చేరుకుని నీటిలో మునిగిపోయిన ఇద్దరు యువకులను బయటకు తీశారు. వీరితో పాటు ఓ ఎద్దు కూడా మరణించింది. మరణించిన యువకులు ఇద్దరూ ఇటీవల పదవ గరతి పరీక్షలు రాశారు. విఘత జీవులుగా పడి ఉన్న కుమారులను చూసి తల్లిదండ్రులు కన్నీటి పర్యవంతం అయ్యారు. కాగా ప్రమాదం జరిగిన కుంటలో తరుచూ నీట మునిగి పలువురు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికే ఈ కుంటలో పడి దాదాపు ఆరుగురు మరణించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు స్పందించి ఈ కుంటను పూడ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



ఉపముఖ్యమంత్రి నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్

స్వచ్ఛ ఆంధ్రలో జిల్లాకు అవార్డు

ఉపముఖ్యమంత్రి నుంచి అందుకున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర అమలులో రాష్ట్రంలో శ్రీసత్యసాయి జిల్లాకు ద్వితీయ అవార్డు దక్కింది. గురువారం నాడు విజయవాడలో జరిగిన జాతీయ పంచాయతీరాజ్ వేడుకల్లో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చేతులమీదుగా కలెక్టర్ టిఎస్.చేతన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్, జిల్లా యంత్రాంగాన్ని డిప్యూటీ సీఎం అభినందించారు.

అవార్డు రావడం సంతోషకరం : జెసి

స్వచ్ఛతలో జిల్లాకు అవార్డు రావడం ఆదర్శనీయమని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్లో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి జాయింట్ కలెక్టర్ సిబ్బంది ఘనంగా నివాళులర్పించారు. జెసి మాట్లాడుతూ అవార్డు రావడంలో పంచాయతీరాజ్ ఉద్యోగుల పాత్ర కీలకం అన్నారు. గ్రామ స్వరాజ్యం సిద్ధించాలంటే గ్రామపంచాయతీల అభివద్ధితోనే సాధ్యమని గాంధీజీ కలలు కన్నారన్నారు. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడంపై అందరం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులకు ప్రశంస పత్రాలు అందించారు. కార్యక్రమంలో డిపిఒ సమత, ధర్మవరం, కదిరి, డివిజనల్ అధికారులు శివకుమారి, అంజనప్ప, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రొద్దం కెజిబివిలో వంద శాతం ఉత్తీర్ణత



కె.దీపిక-535

ప్రజాశక్తి-రొద్దం

పదో తరగతి ఫలితాల్లో కెజిబివి విద్యార్థినులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్ఒ నాగరత్న తెలిపారు. క్రమశిక్షణతో పాటు ప్రణాళి కాబద్ధంగా విద్యార్థినులను పరీక్షలకు సన్నద్ధం చేయడంతోనే 39 మందికి 39 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. కె.దీపిక-535 మార్కులతో పాఠశాల టాపర్గా నిలిచిందన్నారు. గతేడాది కూడా పదో తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవ త్సర ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. ఈ సంవత్సరం ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారికి ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటూ పాఠశాలను అభివృద్ధి బాటలో నడిపిస్తున్నామన్నారు. వంద శాతం ఫలితాలు సాధించిన విద్యార్థినులను అందుకు కృషి చేసిన బోధన, బోధనేతర సిబ్బందిని ఎస్ఒ అభినందించారు.

ఆర్డిటి సెట్కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-అగళి

పదో తరగతి పాసైన విద్యార్థులు ఆర్డిటి సెట్కు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డిటి ఏరియా కోఆర్డినేటర్ ఓబులేసు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులకు ఆరేళ్ల పాటు కార్పొరేట్ కాలేజీలో చదివిస్తుందన్నారు. రొళ్ల ఆఫీస్లో దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయన్నారు. మే 11వ తేదీ హిందూపురంలో పరీక్ష నిర్వహిస్తామన్నారు.

పేదింట విరిసిన విద్యా కుసుమాలు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరవ పల్లి గ్రామానికి చెందిన శివగంగమ్మ, రమేష్ దంపతుల కుమార్తె సి.పవిత్ర పదో తరగతిలో 581 మార్కులు సాధించింది. పవిత్ర హిందూపురంలోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో చదివింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా పెద్ద కుమార్తె ఇంటర్ బైపిసి విభాగంలో అత్యుత్తమ మార్కులు సాధించింది.



సి.పవిత్ర -581

కార్మికుల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

◆ భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల హామీలను అమలు చేయాలి

◆ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న భవన నిర్మాణ కార్మికులకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్.వెంకటేష్ విమర్శించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం పుట్టపర్తిలో నిరసన తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ పలుగు, పార, గంపలతో నిరసన తెలుపుతూ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్.వెంకటేష్, జిల్లా భవన నిర్మాణ కార్మిక యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.సాంబశివ హాజరై మాట్లాడారు. గత వైసిపి ప్రభుత్వం 1214 మెమో వల్ల కార్మికులకు అమలయ్యే సంక్షేమ పథకాలన్నింటినీ రద్దు చేసిందన్నారు. ఎన్నికల ముందు వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నింటినీ పునరుద్ధిస్తామని కూటమి నాయకులు హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి 11 నెలలు అవుతున్నా వాటి గురించి ఇంకా పట్టించుకోలేదన్నారు. ఇచ్చిన హామీని అమలు చేయకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకున్న లేబర్ కోడ్స్కు వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్మికుల సంక్షేమ పథకాలు అమలు కోసం వసూలు చేసిన సెస్ నిధులను కార్మికుల సంక్షేమానికి మాత్రమే ఖర్చు చేయాలన్నారు. అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు సబ్సిడీతో రుణాలు అందించాలని, ప్రభుత్వం అమలు చేసి అన్ని పథకాలను వర్తింప చేయాలన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ను వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అంకె ముత్యాలప్ప, కొండా వెంకటేష్, బాబ్జాన్, మహబూబ్ బాషా, సురేష్, లక్ష్మయ్య, రామాంజి, మహిళా సంఘం నాయకురాలు రమాదేవి పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

ఇళ్ల పట్టాల కోసం నిరుపేదలు గురువారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పట్టణం లోని తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ నగర పంచాయతీ పరిధిలోని పెనుకొండ, తిమ్మాపురం, ఇస్లాపురం వార్డులకు చెందిన ఇల్లు లేని నిరుపేదలు సుమారు 150 మంది ఇళ్ల పట్టాల కోసం రెండేళ్లుగా నిరసనలు, పోరాటాలు చేస్తున్నారన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు హై కోర్టు ఉత్తర్వులను సైతం అమలు చేయలేదన్నారు. క్యాంపులో ఉన్న తహశీల్దార్ శ్రీధర్ ఈ విషయం తెలుసుకొని హుటా హుటిన కార్యాలయానికి చేరుకొని నిరసనకారులతో చర్చించారు. తహశీల్దార్ మట్లాడుతూ నెల రోజుల్లో పట్టాలు ఇవ్వడానికి ఉన్నతాధికారులతో చర్చిస్తామన్నారు. అర్హుల ప్రతిపాదన జాబితాను వారం రోజుల్లో పూర్తి చేస్తామని హామీచ్చారు. పట్టాలు ఇచ్చేంత వరకూ పేదల గుడిసెలు వేసుకొని స్థలాన్ని స్వాధీనం చేసుకుంటారని, భవిష్యత్తులో జరిగే సంఘటనకు తహశీల్దార్ బాధ్యత వహించాలని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం తహశీల్దార్కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సభ్యులు వెంకట్రాముడు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు తిప్పన్న, ఇళ్ల స్థలాల లబ్ధిదారులు అంజనప్ప, నాగమ్మ, ముబిన్తాజ్, షర్ఫున్నీసా, ముంతాజ్, లలిత, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



తహశీల్దార్ శ్రీధర్కు వినతి పత్రం ఇస్తున్న వ్యకాసం నాయకులు

స్వయంశక్తి సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలి

మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వ జ్యోతి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని స్వయం శక్తి సహాయక మహిళా సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వ జ్యోతి, మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో మహిళా సంఘాల ఆర్పిలకు ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలనలో భాగంగా పట్టణ పేద మహిళలను సంఘాలు సమైఖ్యలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా సంఘాలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను ఎప్పటికప్పుడు చెల్లించడం ద్వారా మరింత అధికంగా రుణాలు తీసుకుని ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెప్మా టిఇ ఐబి.భవాని, డిఎంసి ఎల్.గంగులయ్య, డిఈఒ ఇబ్రహీం ఖాన్, సిఒలు తౌసిఫ్, నాగేశ్వరి, పరంజ్యోతి, వరలక్ష్మి, గంగరత్న, పట్టణ సమాఖ్య ఒబిలు విజయ లక్ష్మి, సరస్వతమ్మ, ఆర్.సుజాత, నలిజాక్షి, శంకరమ్మ పాల్గొన్నారు.

ఇళ్ల మంజూరులో జాప్యం వద్దు : పీడీ

ప్రజాశక్తి-లేపాక్షి

ఇళ్ల మంజూరులో జాప్యం చేయవద్దని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకట నారాయణ ఆదేశించారున. స్థానిక గృహ నిర్మాణ శాఖ కార్యాలయంలో గురువారం మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిడి మాట్లాడుతూ మండలంలో నూతన ఇళ్ల కోసం 830 దరఖాస్తులు అందాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు వెంటనే ఇళ్లు మంజూరు చేయాలన్నారు. గతంలో మంజూరైన 162 ఇళ్ల నిర్మాణాలు పూర్తికాకపోవడంతో అదనంగా ఎస్సీ, బిసిలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు అందిస్తున్నాని, వీటితో జూన్ లోపు నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో డీఈ శ్రీనివాసులు, ఎంపిడిఒ నరసింహామూర్తి, ఏఈ రాజేంద్రప్రసాద్, వర్క్ ఇన్స్పెక్టర్ నరేష్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషను ఇష్టపడి చదవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో డాక్టర్ కెఎన్.ఇందిరమ్మ ప్రత్యేకంగా రచించిన 'ఫన్నీ టిట్ బిట్స్' అనే ఇంగ్లీష్ ఒకాబులరీ, గ్రామర్ పుస్తకాన్ని గురువారం పట్టణంలోని లయన్స్ క్లబ్ లో మున్సిపల్ ఛైర్మన్ డిఈ.రమేష్కుమార్ ఆవిష్కరించారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ పద్మప్రియ, లేపాక్షి ఎంఇఒ నాగరాజు, కుళ్లాయప్ప, హిందూపురం ఎంఇఒ గంగప్ప, ప్రసన్నలక్ష్మీ, పరిగి ఎంఇఒ లక్ష్మీదేవి, శేషాచలం పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు కష్టమైన సబ్జెక్టును ఇష్టమైన సబ్జెక్టుగా మార్చి ఈ పుస్తకాన్ని రచించడం అభినందనీయమని ప్రశంసించారు. 3 నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో రామలక్ష్మమ్మ, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఆంగ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న పూలకుంట సర్పంచి

హిందూపురం : రాష్ట్ర స్థాయిలో గురువారం విజయవాడలోని సి కె కన్వెన్షన్ హాల్ లో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో జరిగిన జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలకు హాజరు కావాలని హిందూపురం రూరల్ మండలం పూలకుంట సర్పంచి మంజునాథ్ తో పాటు మణేసముద్రం, తూమకుంట పంచాయతీ కార్యదర్శులు గంగాధర్, కెంచరాయప్పకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. దీంతో వారు జిల్లా పంచాయతీ అధికారిణి సమతతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మణేసముద్రం పంచాయతీ కార్యదర్శి గంగాధర్ పన్నుల వసూళ్లలో ప్రతిభ కనబర్చినందుకు అవార్డు దక్కింది.

బాబా శతజయంతి ఉత్సవాలు

ఘనంగా నిర్వహిస్తాం

సత్యసాయి ట్రస్టీ ఆర్జె.రత్నాకర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రత్నాకర్, పల్లె రఘునాథ్ రెడ్డి

సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా నిర్వహిస్తామని సత్యసాయి ట్రస్టీ ఆర్జె.రత్నాకర్ స్పష్టం చేశారు. సత్యసాయి ఆరాధన ఉత్సవం గురువారం పట్టపర్తిలోని హిల్ వ్యూ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన తరువాత వేలాదిమంది భక్తులకు అన్నప్రసాదాలతో పాటు మహిళలకు చీరలు, పురుషులకు ధోవతి పంపిణీ చేశారు. అనంతరం రత్నాకర్ మాట్లాడుతూ నవంబర్ 23న జరిగే ఈ బాబా శతజయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. బాబా 100వ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు దేశ విదేశాల నుంచి లక్షలాదిమంది సాయి భక్తులు, పర్యాటకులు హాజరవుతారన్నారు. సాయి సేవలు ట్రస్టు కొనసాగిస్తోందని, కొత్త పథకాలు కూడా ప్రవేశపెట్టే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే దివ్యాంజన్ పథకం ద్వారా వికలాంగులకు కత్రిమ పరికరాలు అందిస్తున్నామన్నారు. కల్పతరువు పథకం కింద లక్షల మొక్కలు నాటుతున్నామన్నారు. బాబాపై భక్తితో ఆరాధన ఉత్సవాలకు వేలాదిమంది తరలి వచ్చారన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ సత్యసాయి మానవసేవే మాధవ సేవ, అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు అన్న ఆధ్యాత్మిక సూత్రాలను బోధించారన్నారు. మానవాళికి ఎన్నో సేవలందించిన బాబా శతజయంతి వేడుకలకు ప్రభుత్వం పరంగా అన్ని విధాలా సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షుడు నిమిష్ పాండే, ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానంద తదితరులు పాల్గొన్నారు. డీఎస్పీ విజయ్ కుమార్, సిఐలు సురేష్, ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

అన్నదాన కార్యక్రమాలు

బాబా ఆరాధన ఉత్సవాల సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి సత్రంలో అన్నదానం చేశారు. పట్టణ ప్రధాన రహదారి, చిత్రావతి రహదారి, గోకులం, ప్రశాంతి గ్రామ్లో అన్నదాన కార్యక్రమంతో పాటు మజ్జిగ పంపిణీ చేశారు.

'ఉపాధి' కూలీలకు పే స్లిప్పులు, మస్టర్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-పెనుకొండ

ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు, మస్టర్లు ఇవ్వాలని, పని భారం తగ్గించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని రాంపురం గ్రామపంచా యతీలో ఉపాధి కూలీలు పని చేస్తున్న ప్రదేశాన్ని గురువారం వ్యకాసం నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా కూలీలు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకొచ్చారు. 3 వారాల నుంచి పని చేస్తున్నా పే స్లిప్ప ఇవ్వడం లేదని, 6 రోజులు పని చేస్తే 4 రోజులకు మాత్రమే వేతనం ఇస్తున్నారని వాపోయారు. వారానికి అదనంగా 3 మీటర్లు పని చేయాలని నిబంధన పెడుతున్నారని ఫిర్యాదు చేశారు. రోజు కూలి రూ. 307 ఇవ్వడం లేదని, వెట్టిచాకిరీకి గురవుతున్నామని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై నాయకులు ఎపిఒ జయమ్మతో ఫోన్ ద్వారా మాట్లాడారు. స్పందించిన ఎపిఒ కూలీల సమస్యలను పరిశీలించి పరిష్కారం కోసం కృషి చేస్తామని, పే స్లిప్పులు ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు తిప్పన్న పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

మట్టి అక్రమ తరలింపును ఆపాలి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

మండల పరిధిలోని కొండకమర్లగ్రామపంచాయతీలో నాయనా కోట, చెరువు మునెప్ప పల్లి గ్రామాల మీదగా గ్రీన్ ఫీల్డ్ హైవే పనులు జరుగుతున్నాయనిరహదారి పనుల కోసం కాంట్రాక్టర్లు ప్రభుత్వఅనుమతి లేకుండా విచ్చల విడిగా మట్టి తరలిస్తున్నారని ఈ చర్యలను ఆపాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా పుట్టపర్తి నియోజకవర్గం ఆంజనేయులు మాట్లాడుతూ కొండ గుట్టలో ఉన్న పచ్చని చెట్లను తొలగిస్తూ, పర్యావరణాన్ని హానికలిగిస్తూ మట్టి తరలిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకోకుండా ఎక్కడపడితే అక్కడ మట్టిని అక్రమంగా తరలిస్తున్న కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చలపతి, రత్న బాయ్, సుధాకర్, పూల శ్రీనివాసులు, రామచంద్ర, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - నల్లచెరువు

మండలంలోని అల్లు గుండు గ్రామంలో క్షయ వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు అక్కయ్య, సుధాకర్, ఎఎన్ఎం షరీఫా, హెల్త్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు

ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - బత్తలపల్లి

పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి 500 మార్కులు పైబడిన వారు ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌డి ప్రమీల కుమారి తెలిపారు. గురువారం ఆమె ఏటీఎల్ కృష్ణతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం ఆర్ డి టి పేద విద్యార్థులకు ఇంటర్ చదివేందుకు అవకాశం కల్పిస్తుందన్నారు. 500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు ఈసెట్టుకు అర్హులన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ వర్గాలలో ఆర్డీటీ స్పాన్సర్ షిప్ కలిగి ఉంటే ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో చదివి ఉన్నా అర్హులన్నారు. ఓసి బిసి స్పాన్సర్షిప్ లేనివారు కేవలం ప్రభుత్వ పాఠశాలల్లో మాత్రమే చదివి ఉండాలన్నారు. అటువంటివారు ఈ సెట్టుకు శుక్రవారం నుంచి స్థానిక ఫీల్డ్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మే 11న ఆర్ఆర్‌డి సెట్ పరీక్ష ఉంటుందన్నారు.

రైతులకు మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల పరిధిలోని కటారుపల్లి క్రాస్ వద్ద రెడ్స్ సంస్థ సెట్రిస్ వారి సహకారంతో రైతులకు గురువారం పండ్ల మొక్కలను ఉచితం పంపిణీ చేసినట్లు రెడ్స్ సంస్థ డైరెక్టర్ బానుజ తెలిపారు ఈ కార్యక్రమానికి జిల్లా అగ్రికల్చర్ ఆఫీసర్ సుబ్బారావు ఆర్టికల్చర్ అధికారి చంద్రశేఖర్, సెరికల్చర్ అధికార పద్మావతమ్మ హాజరై రైతులకు మొక్కలు పంపిణీ చేశారు. మొక్కలు నాటుకున్న వారికి 200 లెటర్స్ డ్రమ్ములు కొమ్మలు కత్తిరించే పరికరాలు తదితర అందజేశామని చెపాప్రు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల్లో ఒక్కొక్క కుటుంబానికి 40 వేల రూపాయలు చొప్పున దాదాపు 20 మంది అందజేశామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఫారెస్ట్ అధికారి వెంకటసుబ్బరాయుడు, రెడ్స్ సంస్థ సిబోబంది, రైతులు తదితరులు పాల్గొన్నారు

వడ్డీ కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయండి

ప్రజాశక్తి - తాడిమర్రి

పంటరుణాలు తీసుకున్న రైతులతో వడ్డీ మాత్రమే కట్టించుకుని రుణాలు రెన్యువల్ చేయాలని రైతుసంఘం నాయకులు కోరారు. ఈసందర్భంగా వారు బ్యాంకు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమతం కాటమయ్య, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-హిందూపురం

పరిపూర్ణ ఆరోగ్యానికి పారిశుధ్యం తొలి మార్గమని హిందూపురం రూరల్ మండలం తూమకుంట సర్పంచి రత్నమ్మ పేర్కొన్నారు. గురువారం పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను ప్రారంభించారు. ఈ పనులను సర్పంచి, సచివాలయ సిబ్బంది పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జేసీ చేతుల మీదుగా అవార్డులు

ప్రజాశక్తి తాడిమర్రి

మండలంలో వందశాతం పన్ను వసూలు,పారిశుధ్యంలో మెరుగైన చర్యలు చేపట్టిన అధికారులు జాయింట్ కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ అధికారులు రిజ్వానా తదితరులు పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం జేసీ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మండలంలో నీటి కొరత లేకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సాయి మనోహర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం స్థానిక ఎంపిపి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రస్తుతం వేసవి కాలంలో మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పంచాయతీరాజ్ దినోత్సవం వేడుకలను నిర్వహించారు. మండల పరిధిలోని పలు పాఠశాలల్లో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పదిమంది విద్యార్థులను సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో వైస్ ఎంపిపి ప్రతాప్ రెడ్డి, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

మేడే వేడుకలను ఘనంగా నిర్వహించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న జంగాలపల్లి పెద్దన్న

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

మేడే బేడుకలను ఘనంగా నిర్వహించుకుందామని ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న పిలుపునిచ్చారు. మేడే ప్రిపరేషన్ సమావేశం స్థానిక ఎన్జీవో హోంలో సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా జమ్మూ కాశ్మీరులో ఉగ్రవాదుల దాడులలో మరణించిన వారికి సంతాపంగా ఒక నిమిషం మౌనం పాటించారు. అనంతరం నాయకులు ఎల్ ఆదినారాయణ అధ్యక్షత జరిగిన ఈ సమావేశంలో జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కన్వీనర్ జేవీ రమణ, చేనేత కార్మిక సంఘం నాయకులు ఎస్‌హెచ్. బాషా, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేడే వేడుకల నిర్వహణకు సంబంధించిన విషయాలను చర్చించారు. మే 20న నిర్వహించే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ. మారుతి, ఎస్ హైదర్‌వలి, వి వెంకటస్వామి, చంద్రకళ, సరస్వతి, పోతక్క, దీన అరుణ, చింతమ్మ, మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు బాబు, ముకుందా, లక్ష్మీ ఓబులేసు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

ప్రజాశక్తి-హిందూపురం


రక్షితను సన్మానిస్తున్న అనీల్ కుమార్ తదితరులు

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో లేపాక్షి మండలం శిరివరం గ్రామానికి చెందిన రక్షిత రికార్డు స్థాయిలో 591 మార్కులు సాధించింది. శిరివరం గ్రామానికి చెందిన ఆనంద్, అనిత దంపతుల పెద్ద కుమార్తె రక్షిత జిల్లా పరిషత్ పాఠశాలలో చదివి జిల్లా స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించింది. జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం, మండల వ్యాప్తంగా మొదటి స్థానాన్ని సాధించింది. గురువారం పట్టణంలోని సువర్ణ భారతీ జూనియర్ కళాశాలలో రక్షితకు కళాశాల తరపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రెటరీ అనీల్ కుమార్ మాట్లాడుతు కృషి, పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని రక్షిత నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది రాము, చిన్నా, కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వెంకట్, బాబావలి తదితరులు పాల్గొన్నారు.


సి. కీర్తన


పి. మిస్బా


డి. కీర్తన

పది పరీక్షల్లో ఆదర్శ పాఠశాల టాప్

ప్రజాశక్తి గాండ్లపెంట

పదో తరగతి ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రైవేటు ఆదర్శ పాఠశాల విద్యార్థులు టాప్‌లో నిలిచారు. ఈ పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత నమోదయిందని పాఠశాల కరస్పాండెంట్ కె మహేష్ బాబు, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున తెలిపారు 59 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. వారిలో సి. కీర్తన 588, పి మిస్బా 585, డి. కీర్తన 571 మార్కులు సాధించారని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

నాలుగు దశల్లో ఇంటర్ అధ్యాపకులకు శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల ప్రారంభోత్సవంలో అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ఇంటర్మీడియట్ విద్యా మండలి ఆదేశాల మేరకు 2025-26 విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం కోర్సుల్లో కొత్త సిలబస్ కు అనుగుణంగా విద్యా బోధన తదితర అంశాలపై అధ్యాపకులకు నాలుగు దశల్లో శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి రఘునాథరెడ్డి, పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మొదటి విడత శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మారిన సిలబస్ లో విద్యా విధానం, ప్రశ్నాపత్రం విధానంలో చేసిన మార్పులపైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు, అతిథి జూనియర్ అధ్యాపకులకు అవగాహనా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 24వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు నాలుగు దశలలో ఈ శిక్షణ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మొదటి దశ 24, 25వ తేదీల్లో తెలుగు, ఇంగ్లీష్, హిందీ, ఉర్దూ, రెండవ దశ 28, 29వ వరకు గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం అధ్యాపకులకు, మూడో దశ మే2, 3వ తేదీల్లో జంతుశాస్త్రం, చరిత్ర, అర్థశాస్త్రం అధ్యాపకులకు చివరి విడతలో 5, 6వ తేదీల్లో కామర్స్, సంస్కృతంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించి అధ్యాపకులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అధ్యాపకులందరూ మినహాయింపు లేకుండా విధిగా హాజరు కావాల్సి ఉంటుందని, లేనిపక్షంలో సంబంధిత అధ్యాపకులపై శాఖా పరమైన చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు.

మంట కలిసిన మానవత్వం

అనారోగ్యంతో ఉన్న వృద్ధుడిని చెట్టు కింద వదిలేసిన బంధువులు

స్పందించి ఆసుపత్రికి తరలించిన పోలీసులు

ప్రజాశక్తి బత్తలపల్లి

అనారోగ్యంతో ఉన్న ఓ వృద్ధుడిని అతని కుటుంబసభ్యులు రోడ్డు పక్కన చెట్టు కింద వదిలేసి చేతులు దులుపుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వృద్ధుడిని చేరదీసి చికిత్స నిమిత్తం ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని మాల్యవంతం గ్రామ సమీపంలోని నార్పలకు వెళ్లే రహదారిలో ఓ చెట్టు కింద గుర్తుతెలియని వృద్ధుడిని వదిలిపెట్టి వెళ్ళారని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు కానిస్టేబుల్ అనిల్ కుమార్, హోంగార్డ్ నరసింహులు ఆ ప్రాంతానికి వెళ్లాడు. నడవలేని స్థితిలో చెట్టు కింద ఉన్న వృద్ధుడిని 108 అంబులెన్స్‌లో ఆర్డీటీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అందించే విధంగా చర్యలు చేపట్టారు.

సకాలంలో ఇకెవైసి పూర్తి చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు రూరల్ మండల వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఇకెవైసిని సకాలంలో పూర్తి చేయాలని డిప్యూటీ తహశీల్దార్ మైనుద్దీన్ స్టోర్ డీలర్లకు, ఎండీయూ ఆపరేటర్లకు సూచించారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ ఆరతి తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 96 చౌక దుకాణాల పరిధిలో 1,73,111 మంది ఉన్నారని ఇందులో ఇప్పటివరకు 1,57,100 ఈ కేవైసీ పూర్తి చేశారని చెప్పారు. పట్టణ, మండల వ్యాప్తంగా ఐదు సంవత్సరాల లోపు 2146 మంది ఉన్నట్లు తేలిందన్నారు. వీరితోపాటు 80 సంవత్సరాలు పైబడిన వారు 96 మంది ఉన్నారన్నారు. చిన్నారులు,వృద్ధులకు ఈ కేవైసీని ప్రభుత్వం మినహాయించిందన్నారు. మిగిలిన 13769 మందికి సంబంధించిన ఈ కేవైసీ పూర్తి చేయాల్సి ఉందన్నారు. సచివాలయం సిబ్బందితో సమన్వయం చేసుకొని వచ్చే నెల 30వ తేదీ లోపల ఈ కేవైసీ ని పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మండల వ్యాప్తంగా ఉన్న స్టోర్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే పంచాయతీరాజ్ లక్ష్యం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడమే పంచాయితీ రాజ్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశం అని ఎంపిడిఒ సరస్వతి అన్నారు. హిందూపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఆధ్వర్యంలో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ హనుమ నాయక్, ఎంపిడిఒ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభా విద్యార్థికి అభినందనలు

ప్రజాశక్తి - బుక్కపట్నం


ప్రతిభా విద్యార్థిని అభినందిస్తున్న దృశ్యం

పదవ తరగతి పరీక్ష ఫలితాలలో 594 మార్కులు సాధించి మండల టాపర్ గా నిలిచి బుక్కపట్నం గ్రామానికి చెందిన హరీష్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కిష్టప్ప ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువారం డిఇఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతిభా విద్యార్థి హరీష్, అతని తల్లిదండ్రులను డిఇఒ సన్మానించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. పిల్లల విజయాలలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ గోపాల్ నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జగదీష్, విద్యార్థి తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


గౌతమ్‌రెడ్డి


నవధీర్‌నాయుడు


వర్షిణి

పదిలో మెరిసిన 'వశిష్ట' విద్యార్థులు

ప్రజాశక్తి - ఓబుళ దేవర చెరువు

పదవ తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక వశిష్ట ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. పాఠశాలకు చెందిన బి గౌతమ్ రెడ్డి 597 మార్కులతో పాఠశాలలో మొదటి స్థానాన్ని , నవదీర్ నాయుడు 591 మార్కులతో రెండవ స్థానంలో జి వర్షిని 586 మార్కులతో మూడో స్థానాన్ని సాధించారు. ఇంతటి ఘనవిజయాన్ని సాధించిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెడ్ పిట్ట శివ శంకర్ రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు

ఉగ్రదాడి దారుణం

ప్రజాశక్తి నల్లమాడ

జమ్మూ కాశ్మీర్లో మంగళవారం పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడి దారుణమని సిపిఎం నాయకులు పేర్కొన్నారు. ఈ దాడిలో 28 మంది అమాయక పర్యాటకులను నిర్దాక్షిణ్యంగా హతమార్చడం పిరికిపంద చర్య అని అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదుల ఆచూకీ కనుగొని తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవిందు, రామయ్య, మల్లిఖార్జున, రాజు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం :ఉగ్రదాడి మృతుల ఆత్మకు శాంతి కలగాలని గురువారం రాత్రి పట్టణంలో ముస్లీం ఐక్య వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా జనసేన ఆధ్వర్యంలో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ముస్లీం ఐక్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అఖిల భారత షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్ జాతీయ అధ్యక్షుడు ఉమర్ ఫారూఖ్ ఖాన్, హిందూపురం ముస్లిం ఐక్య వేదిక సభ్యులు అజ్మతుల్లా ఖాన్, న్యాయవాది ఇందాద్, మౌలానా షాబుద్దీన్, మౌలానా అన్సారీ, జమీల్, అమానుల్లా, చాంద్ బాషా, బిలాల్ అమీన్ తదితరులు పాల్గొన్నారు. జనసేన ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆకుల ఉమేష్, నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : కాశ్మీర్ ఉగ్రదాడులను స్థానిక ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ఖండించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

పావగడ : భారతదేశం ఎప్పుడూ శాంతి, సామరస్యతలకు విలువనిచ్చే దేశమని, అలాంటి దేశంలో ఉగ్రదాడి జరగడం ఖండనీయమని పురసభ సభ్యుడు ఇమ్రాన్ తెలిపారు. ఉగ్రదాడిని ఖండిస్తూ గురువారం తాలూకా జామియా మసీదు, నవజవాన్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇమ్రాన్ మాట్లాడుతూ ఇస్లాంలో ఉగ్రవాదానికి స్థానం లేదన్నారు. ఇలాంటి చర్యలపై ప్రతి ఒక్కరూ గళం విప్పాలన్నారు. ఈ దుర్ఘటనలో మృతుల కుటుంబాలకు భగవం తుడు ధైర్యం ప్రసాదించాలని ప్రార్థిస్తూ మౌనం పాటించారు. ఆర్‌టి.ఖాన్ మాట్లాడుతూ కాశ్మీర్‌లో నరమేధానికి పాల్పడిన ఉగ్రవాదులను భారత సైన్యం పట్టుకుని శిక్షించాలని కోరారు. అనంతరం తహశీల్దార్ వరదరాజులుకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జామియా మసీదు సంస్థ అధ్యక్షులు లతీఫ్‌సాబ్, కార్యదర్శి మహ్మద్‌జావేద్, కోశాధికారి సమీవుల్లా, ముస్లిం నాయకులు ఎంఎఆర్. రియాజ్, సికిందర్, ఆర్‌కె.నిసార్, హిదాయత్, షఫీ, మర్జన్, షాబాబు, రిజ్వాన్‌ఉల్లా పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లీం ఐక్య వేదిక నాయకులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో..

కదిరి టౌన్ : జమ్మూ కాశ్మీర్ పర్యాటకులపై కాల్పులు జరిపిన తీవ్రవాదులను వెంటనే శిక్షించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి తాహెర్ వలి డిమాండ్ చేశారు . ఈ మేరకు గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతిరాలి చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనుద్దీన్ మల్లికార్జున, ఆజంబాషా, సునీల్, సంతోష్, రవివర్ధన్ రెడ్డి, మధుసూధన, రెడ్డి రాజేష్, నజీర్, బ్రహ్మేంద్ర, ఖాదర్ బాషా, రమణ నాయక్, మనోహర్, షరీఫ్, సుధాకర్, నాగేంద్ర, ప్రధానోపాధ్యాయులు రియాజ్, మెహబూబ్ భాష,

సత్యసాయిబాబా ఆరాధన మహోత్సవం

ప్రజాశక్తి-పావగడ

పట్టణంలోని శనిమహాత్మ సర్కిల్ సమీపంలో గురువారం సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సత్యసాయి బాబా 14వ ఆరాధన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి బాబా చిత్రపటానికి పూలమాల వేసి ఊరేగించారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు రామ్‌ప్రసాద్, మహేష్, సత్యనారాయణశెట్టి, శ్రీనాథ్, గోవింద, అనితాలక్ష్మి, పద్మప్రసాద్, పూర్ణిమ, అర్చన, ఇంద్రాణి, భారతి, అనిత, వరలక్ష్మి, అనుసూయ, అనంత లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫీజు చెల్లింపునకు నేడు ఆఖరు

ప్రజాశక్తి-హిందూపురం

ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యేందుకు శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల లోపు ఫీజులు చెల్లించాలని శ్రీ సత్యసాయి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. పరీక్ష ఫీజు చెల్లింపునకు గడువు పొడిగించలేదనిఫెయిల్ అయిన విద్యార్థులు ఈ విషయాన్ని గమనించి ఆయా కళాశాలలో పరీక్ష ఫీజు చెల్లించాలని ఆయన కోరారు.

మున్సిపల్ కమిషనర్‌పై చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ పై చర్యలు తీసుకోవాలని వైసిపి రాష్ట్ర యువజన కార్యదర్శి తలమర్ల సంజీవరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం పుట్టపర్తి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో గల స్నేహలత ఫౌండేషన్ సంస్థ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ పలు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారన్నారు. ఆయన వైఖరిపై అనేకసార్లు పై అధికారులకు ఫిర్యాదు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. శ్రీ సత్యసాయిబాబా శత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించాలని తలపెట్టిన కార్యక్రమాలలో సైతం ఇలాంటి అవినీతికి పాల్పడటాన్ని సహించరాదన్నారు. ఇటువంటి అవినీతి అధికారిని కూటమి నాయకులు వెనకేసుకోని రావడం, ప్రభుత్వం సమర్థించడం శోచనీమని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్ పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అప్పటికి ఆయన పై చర్యలు తీసుకోకపోతే ఈ నెల 28న రాష్ట్ర రాజధాని అమరావతి లో పురపాలక సంఘ ప్రధాన కార్యదర్శి వి వసంత కుమార్ ని కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. పురపాలక సంఘానికి సంబంధించి డస్ట్ బిన్లు, నీటి సరఫరాకు ఉపయోగించే మోటర్ల కొనుగోలులో మున్సిపల్ కమిషనర్ అవినీతికి పాల్పడినట్లు తమ వద్ద పక్క సమాచారం ఉందని అన్నారు.

'పది'లో వందశాతం ఫలితాలు

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ధర్మవరం మండలంలో ఆరు పాఠశాలలు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమని ఎంఇఒలు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ప్రియదర్శని పాఠశాలకు చెందిన పి. శ్రావణి 596, కాకతీయ పాఠశాలకు చెందిన యు. విష్ణు 595 మార్కులు సాధించారన్నారు. ప్రభుత్వ మున్సిపల్ బి ఎస్ ఆర్ పాఠశాల బాలుర ఉన్నత పాఠశాలలో గుర్రం మనోజ్ కుమార్ 594 మార్కులు సాధించి మున్సిపల్ పాఠశాలలో మొదటి స్థానంలో ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను ఎంఇఒలు అభినందించారు.

అవార్డు గ్రహీతలకు సన్మానం

ప్రజాశక్తి - బత్తలపల్లి

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన గ్రహీతలను సన్మానించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి బగ్గిరి త్రివేణి, జడ్పిటిసి కోటి సుధల ఆధ్వర్యంలో జాతీయ పంచాయితీరాజ్ దినోత్సవం సందర్భంగా అవార్డు గ్రహీతలైన ఎంపీడీవో నరసింహ నాయుడు, ఇఒఆర్‌డి క్రిష్ణప్ప, దంపెట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి భారతి, ఏవో శ్రీనివాసులు, ఏపీవో ఆదెప్ప, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, టైపిస్టును సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైళ్ల రాకపోకలను పునరుద్ధరించండి

బత్తలపల్లి : నీట్ పరీక్షల దృష్ట్యా విద్యార్థులకు అనువుగా ఉండే విధంగా ఇదివరకు నిలిపివేసిన ధర్మవరం -మచిలీపట్నం రైళ్ల రాకపోకలను పునరుద్ధరించాలని టిడిపి ఎస్సీ సెల్ నాయకులు ఉమ్మల చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ధర్మవరం నుంచి ప్రారంభమవుతున్న రైళ్లను తాత్కాలికంగా నిలిపివేసి అనంతపురం వరకే రాకపోకలను కొనసాగిస్తున్నారని అన్నారు. దీనివల్ల విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతారన్నారు. అదేవిధంగా ట్రైన్ నం. 17248, ధర్మవరం-నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కూడా కదిరి వరకే రాకపోకలు కొనసాగిస్తున్నారని దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. మే నెల 4న నీట్ పరీక్ష నిర్వహిస్తున్నారని ఇంటర్మీడియట్ తరువాత వైద్య విద్య కోసం జాతీయస్థాయిలో అర్హత పరీక్ష నిర్వహిస్తున్నందున రాష్ట్రమంతటా ప్రధాన నగరాలలో ఈ పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్షా సెంటర్లు అధికంగా రాష్ట్ర రాజధాని విజయవాడలోనే ఉంటాయని రాయలసీమ ప్రాంత విద్యార్థులు వేల సంఖ్యలో విజయవాడలో కోచింగ్ తీసుకుంటున్నారని గుర్తు చేశారు. కోస్తా ప్రాంత విద్యార్థులు కూడా ఇక్కడికి వచ్చి పరీక్షలు రాయాల్సి ఉంటుందని ఉన్నతాధికారులు గుర్తించి ధర్మవరం-మచిలీపట్నం రైలును ధర్మవరం వరకు రాకపోకలు కొనసాగించాలని కోరారు.

పది పరీక్షల్లో గిరిజన విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి ముదిగుబ్బ

పదోతరగతి పరీక్షల్లో మండలం అడవి బ్రాహ్మణపల్లి తండాకు చెందిన గిరిజన విద్యార్థిని ఇస్లావత్ గౌతమిబాయ్ ప్రతిభ కనపర్చింది.కస్తూరి బాయ్ స్కూల్లో చదువుతూ పదో తరగతి ఫలితాల్లో 497 మార్కులు సాధించింది. ప్రతిభా విద్యార్థినిని ఈసందర్భంగా గ్రామస్తులు అభినందించారు. పేద కుటుంబానికి చెందిన ఈ విద్యార్థిని విద్యాభివృద్ధికి దాతలు సహకరించాలని విద్యార్థిని కుటుంబసభ్యులు కోరారు.

పంచాయతీ భూమిని ఆక్రమిస్తే చర్యలు

చిలమత్తూరు : పంచాయతీ భూములు ఆక్రమణ చేస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో రమణమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని కోడికొండ చెక్ పోస్ట్ లోని మొరంపల్లి క్రాస్ సమీపంలో సర్వే నంబర్ 749- 2 లో మూతబడిన ఎంపీపీఎస్ పాఠశాల భూములను పరిశీలించారు. పంచాయతీ భూములు అన్యాక్రాంతం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమినికొంతమంది ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తుందున 'ప్రభుత్వ భూమి' అని బోర్డు ఏర్పాటు చేయాలని పంచాయతీ అధికారులకు ఎంపిడిఒ సూచించారు. ఈ కార్యక్రమంలో కోడూరు పంచాయతీ కార్యదర్శి భాస్కర్ తదితరులు ఉన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి

హిందూపురం : మహిళలు వృత్తిలో నైపుణ్యత పెంపొందించుకొని ఆర్థిక అభివృద్ధి సాధించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మేళాపురం మీ సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్‌తో పాటు ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూపురం శాసన సభ్యులు నందమూరి బాలకృష్ణ మహిళలకు ప్రత్యేకంగా శిక్షణ ఇప్పించి 5 వేల కుట్టు మిషన్ లను ఉచితంగా ఇప్పించేందుకు చర్యలు తీసుకున్నారన్నారు. దాదాపుగా 10 శిక్షణా కేంద్రాలను ఏర్పాటు చేసి 90 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఉచిత శిక్షణలో 75శాతం హాజరు ఉంటే ఉచిత కుట్టు మిషన్, సర్టిఫికెట్‌ను ఎంఎల్ఎ చేతుల మీదుగా అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగమణి, నాగేంద్రమ్మ, రహమత్ బీ, సునీత, సతీష్ కుమార్, మల్లికార్జున గౌడ్, ఆయూబ్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, రాష్ట్ర అంగన్వాడీ కార్యదర్శి వెంకట లక్ష్మీ, ఉభయ జిల్లాల ట్రైనింగ్ భాగస్వామి రవి నాయక్, టి.ఎమ్.సి. గంగులయ్య, టి.ఎల్.ఎఫ్. అధ్యక్షురాలు విజయలక్ష్మి, టీడీపీ నాయకులు దుర్గా నవీన్, కిరోసిన్ బాబు, నాగేంద్ర, నజీర్, అమీన్, భార్గవ్, మెప్మా సిఐలు, ఆర్పీలు, సిబ్బందితో పాటు మహిళలు పాల్గొన్నారు.